క్లుప్తంగా

శాంతియుతంగా జీవించండి


మాట్లాడుతున్న డీఎస్పీ హుస్సేన్‌ పీరా

కొండాపురం : ఫ్యాక్షన్‌ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని జమ్మలమడుగు డీఎస్పీ హుస్సేన్‌ పీరా తెలిపారు. ఆదివారం తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఫ్యాక్షన్‌ గ్రామమైన టీ.కోడూరు వాసులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. చట్టంకు విరుద్ధంగా ప్రవర్తించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్‌ రఫీ, ఎస్‌ఐలు చంద్రశేఖర్‌, విద్యాసాగర్‌ పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

లింగాల : నేటి నుంచి మూడు రోజుల పాటు సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఓ లోకేశ్వరరావు తెలిపారు. శిక్షణ తరగతులలో పంచాయతీల అభివృద్ధి, పారిశుద్ధ్య, వీధి దీపాలు, తడిచెత్త, పొడి చెత్త సేకరణ, చెత్తనుంచి వర్మీకంపోస్టుల ఎరువుల తాయారీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న సర్పంచులు, కార్యదర్శులందరు పాల్గొనాలన్నారు.

వల్లూరు ఎస్‌ఐగా సంజీవ రాయుడు



వల్లూరు : స్థానిక ఎస్‌ఐగా ఎంఎస్‌ సంజీవరాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వల్లూరు ఎస్‌ఐగా పని చేస్తున్న కత్తి వెంకటరమణను రాజుపాలెం ఎస్‌ఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కడప టూ టౌన్‌ ఎస్‌ఐ సంజీవ రాయుడును బదిలీపై ఇక్కడ నియమించారు.

సర్దుబాటు కాదు.. పదోన్నతులు కల్పించాలి

వైవీయూ : రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీఓ ప్రకారం ఇప్పుడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మేకల శివార్జున పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్‌ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నంబర్‌ 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. లోపభూయిష్టమైన జీఓను రద్దు చేయకుండా, ఆ జీఓ ఆధారంగా పని సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ఇంగ్లీషు మీడియంతోపాటు తెలుగు మీడియం ప్రవేశ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన తర్వాత వర్క్‌ అడ్జెస్ట్‌మెంట్‌ లేదా రేషనలైజేషన్‌ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.గంగరాజు, కార్యదర్శి కె.గంగాధర్‌ పాల్గొన్నారు.

ఖాళీలు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్‌ ఉపాధ్యాయులను మెథడాలజీ ఆధారంగా ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలనే ఆలోచన విరమించి మెథడాలజీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

యంత్రాలతోనే.. వ్యవసాయం

- వ్యవసాయంలో పెరుగుతున్న యంత్రాల వినియోగం
- కాడెద్దులకు తగ్గుతున్న ఆదరణ
- యంత్రాలతో ఖర్చు తక్కువ


కాడెద్దులతో సేద్యం చేస్తున్న రైతు


ట్రాక్టర్‌తో విత్తనం వేస్తున్న దృశ్యం

పెద్దముడియం : గతంలో పొలం దున్నాలన్నా, విత్తనం వేయాలన్నా, పండించిన పంటను ఇంటికి తీసుకురావాలన్నా కాడెద్దులు, ఎడ్ల బండిని ఉపయోగించేవారు. మండలంలో దాదాపు 40,000 ఎకరాల సాగు భూమి ఉండగా గతంలో దాదాపు వందల సంఖ్యలో కాడెద్దులు ఉండేవి. కాని ప్రస్తుతం మండలంలో కేవలం 49 జతల కాడెద్దుల మాత్రమే ఉన్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ట్రాక్టర్లు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాల రాకతో కాడెద్దుల వినియోగం తగ్గింది. గ్రామాల్లో అక్కడక్కడ తప్ప ఎక్కువగా కనిపించడం లేదు. వ్యవసాయంలో రైతులకు వెన్నెముకగా నిలిచిన కాడెద్దులు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.

యంత్రాలపైనే రైతులు మొగ్గు

వ్యవసాయం చేసే ప్రతి రైతు ఇంటివద్ద ఎడ్లబండి, పశువులు, పశువుల పాక ఉండేది. ఎడ్లబండ్లు ఉన్న వారికి సంవత్సరమంతా పని ఉండేది. కాని వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో కాడెద్దులకు ప్రాధాన్యత తగ్గింది. సాంకేతికత పెరిగిపోవడంతో రైతులు తక్కువ సమయంలోనే పనులు ముగించుకునేలా యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతుల ఇంటి ముందు ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కాడెద్దులు కొందామన్నా రూ.లక్ష వరకు ఉండటం దానికి దాణా కోసం అయ్యే ఖర్చు మరింతగా ఉండటంతో రైతులు వాటిపై ఆసక్తి చూపడం లేదు.

సబ్సిడీపై యంత్రాలు

ఒకప్పుడు ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండా వ్యవసాయం చేసుకునేవారు. కానీ ప్రభుత్వాలు వ్యవసాయానికి వివిధ రకాల పథకాలు అమలు చేస్తున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు కూడా సాంకేతిక ఆధునిక యంత్రాలు సబ్సిడీపై అందజేస్తున్నారు. ట్రాక్టర్‌తో పాటు వివిధ రకాల విత్తనాల గొర్రులు, కోత మిషన్లు, రోటావేటర్‌ తదితర వాటిని ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వాయిదాల రూపంలో యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతులు కాడెద్దులతో వ్యవసాయం చేయుటకు ఆసక్తి చూపడం లేదు.

ట్రాక్టర్‌తో వ్యవసాయం సులభతరం



నాకు పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నాకు గతంలో కాడెద్దులు లేకపోవడంతో కాడెద్దులు ఉన్న వారికి బాడుగ చెల్లించి వ్యవసాయ పనులు చేయించేవాడిని. ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చిన తరువాత ట్రాక్టర్‌తో వ్యవసాయం చేస్తున్నాం. గతంలో కాడెద్దులతో రోజుకు 5 ఎకరాలు వ్యవసాయం మాత్రమే చేసేవాళ్లం. ఇప్పుడు ట్రాక్టర్‌తో అయితే రోజుకు 20 ఎకరాలపైగా వ్యవసాయం చేస్తున్నాం. దుక్కులు కాడ నుంచి మొత్తం పనులన్నీ ట్రాక్టర్లతోనే చేస్తున్నాం

– ఈశ్వరరెడ్డి, రైతు, పెద్దపసుపుల

నేటి నుంచి శిక్షణ

వల్లూరు : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సభా భవనంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గ్రామ పంచాయతీ పరిపాలన, విధులు, ఎస్‌డబ్ల్యూపీసీ, వీధి లైట్లు, శానిటైజేషన్‌ మొదలైన అంశాలపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు


వివరాలను తెలుపుతున్న సీఐ నారాయణ యాదవ్‌

వల్లూరు (చెన్నూరు) : కొండపేట గ్రామం సమీపంలోని పెన్నానది బ్రిడ్జి వెనుక వైపున పేకాట స్థావరాలపై ఆదివారం ఇన్‌చార్జి సీఐ నారాయణయాదవ్‌ ఆధ్వర్యంలో దాడిచేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సిద్ధమవుతున్న గణనాథులు



ఎర్రగుంట్ల : మూడు నెలల నుంచి వినాయక చవితి పండుగకు గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలకు మరింత డిమాండ్‌ పెరిగింది. ప్రొద్దుటూరు, కడప, ఎర్రగుంట్ల పట్టణాలలో భారీగా వినాయకుడి విగ్రహాలు సిద్ధమయ్యాయి. సుమారు 20 అడుగుల విగ్రహాలు ఉన్నాయి. ఇప్పటి నుంచి కమిటీ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఎర్రగుంట్ల పట్టణంలోని మూడు చోట్ల విగ్రహాల అమ్మక కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు.




పండుగకు సిద్ధమైన వినాయకుడి విగ్రహాలు

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మ


ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

పులివెందుల రూరల్‌ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామంలో వెలసిన అచ్చివెళ్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

అమ్మవారికి విశేష పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో, పూల మాలలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారికి కానుకలను ముడుపులను సమర్పించుకున్నారు. అనంతరం విందు భోజనాలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దివ్యాంగులకు నిత్యావసర సరకులు వితరణ


దివ్యాంగులకు నిత్యవసర సరుకులను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్‌ : ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఆదివారం దివ్యాంగులకు దేవిరెడ్డి తిరుపాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని నిత్యావసర సరుకులను అందజేశారు. వికలాంగుల నెట్‌వర్క్‌ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రెడ్డిమెస్‌ పేరుతో విద్యార్థులు, నిరుద్యోగులకు తక్కువ రుసుముతో 30 ఏళ్లుగా భోజనాన్ని అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. 10 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తిరుపాల్‌రెడ్డి మృతి చెందాడన్నారు. ప్రతి ఏడాది దివ్యాంగులకు చేయూతనందిస్తున్న కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. వారి సేవాస్ఫూర్తిని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి సతీమణి నారాయణమ్మ, నెట్‌వర్క్‌ కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులకు అడ్డుకట్ట వేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ్‌ శేఖర్‌ కోరారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజును ఆయన ఆదివారం కలిసి అంబేడ్కర్‌ చిత్రపటం బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల దళిత వర్గాలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్‌, రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్‌, కడప నగర అధ్యక్షుడు చెంచుల డేవిడ్‌ సత్యారాజ్‌, జమ్మలమడుగు తాలూకా యూత్‌ అధ్యక్షులు జె.దీపక్‌, పోతు బోయిన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల మధ్య రాజారెడ్డి వర్ధంతి

ప్రొద్దుటూరు క్రైం : రాజాఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు రాజారెడ్డి ప్రథమ వర్ధంతిని ఆదివారం అనాథ పిల్లల మధ్య నిర్వహించారు. ప్రొద్దుటూరులోని పూజా స్కూల్‌తో పాటు మైలవరంలోని డాడీహోంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో అనాథ పిల్లలు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాఫౌండేషన్‌ మాజీ చైర్మన్‌ రాధా, మాజీ సీఈఓ కవిత మాట్లాడుతూ డాడీ మరణం తమను శాశ్వతంగా అనాథలను చేసి చీకట్లోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. డాడీ హోం అనే ఆలయంలో ఎందరో అనాథలు, అభాగ్యులకు నిలువ నీడ, పట్టెడు అన్నం దొరుకుతోందని చెప్పారు. అనాథ పిల్లలతో పాటు సంస్థ సిబ్బంది రాజారెడ్డిని స్మరించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం రాజారెడ్డి జ్ఞాపకార్థం పూజా ఇంటర్నేషనల్‌ స్కూల్‌ మెమోరియల్‌ లైబ్రరీని ఏర్పాటు చేశారు.

బుడ్డా వెంగళ్‌రెడ్డి పేరు పెట్టండి

పులివెందుల రూరల్‌ : మధ్యాహ్నం బడి భోజన పథకానికి కర్నూల్‌ జిల్లాకు చెందిన బుడ్డా వెంగళ్‌రెడ్డి పేరును నామకరణం చేయాలని స్టూడెంట్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుతవా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరును నామకరణం చేశారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన బుడ్డా వెంగళ్‌రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు, దాన ధర్మాలు చేసి చరిత్రలో నిలిచిపోయారు. నేటికి ఆయన చేసిన సేవలను కొనియాడుతున్నారు. రాయలసీమ ప్రాంతంలోని మధ్యాహ్న భోజన పథకానికి వెంగళ్‌రెడ్డి పేరు నామకరణం చేయాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

కమలాపురం : సర్వరాయ సాగర్‌ పంట కాలువలను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్‌ చేశారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన ఏరియా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గాలేరు–నగరి సుజల స్రవంతి రెండో దశ పనులను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీపీఐ దశల వారీ పోరాటం చేసేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమలాపురం నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. సర్వరాయసాగర్‌ పనులు ఏళ్ల తరబడి జరుగుతున్నాయంటే పాలకుల నిర్లక్ష్యమే అని ఆయన మండిపడ్డారు. గండికోట, సర్వరాయసాగర్‌లో జలకళ ఉట్టి పడుతున్నప్పటికి ఆయకట్టు రైతాంగానికి గుక్కెడు నీళ్లు ఇవ్వలేని స్థితి నెలకొందన్నారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వమైనా సర్వరాయసాగర్‌ పనులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలని ఆయన డిమాండ్‌చేశారు. సెప్టెంబర్‌ మాసం 3వ వారంలో సర్వరాయసాగర్‌కు కృష్ణా జలాలు రానున్న నేపథ్యంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆయకట్టు రైతాంగంతో కలసి కడప కలెక్టరేట్‌కు పాదయాత్ర చేపడుతున్నట్లు ఆయన వివరించారు. రైతులందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గాలేరు నగరి సుజల స్రవంతి రెండో దశ పనులు ప్రారంభమైనప్పటికి నత్తనడకన సాగుతున్నాయన్నారు. తక్షణం పనులను వేగవంతం చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. కమలాపురంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌ఓబీ నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. చెన్నూరు చక్కెర పరిశ్రమ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడం.. శిథిలం


మినార్‌ పైభాగంలోని గుంబద్‌


మినార్‌పై పెచ్చులు ఊడిన దృశ్యం


కడప మినార్‌

- కడప నవాబుల ప్రాభవాన్ని చాటుతున్న మినార్లు
- ఇస్లామిక్‌ నిర్మాణ శైలిలో ఏర్పాటు
- నిర్వహణ లేక.. మరమ్మతుకు నోచుకోక..

ఓ ప్రాచీన కట్టడాన్ని సందర్శిస్తే చరిత్రలోకి ప్రయాణించినట్లేనని చరిత్రకారులు అంటారు. కడప గొప్ప వారసత్వ కట్టడాలకు నిలయం. జాతి మూలాలకు సజీవ తార్కాణాలైన ఆ వారసత్వ సంపదలు క్రమంగా శిథిలమైపోతున్నాయి. కళలు, సంస్కృతికి ఎంతో ప్రాధాన్యమిచ్చిన మన ప్రాచీన పాలకులు ఎన్నో అద్భుత నిర్మాణాలు చేపట్టారు. కాలపరీక్షకు తట్టుకుని నిలిచిన ఆ కళాఖండాలను భావితరాలకు భద్రంగా అందించడం మన బాధ్యత. కానీ సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అందుకు నిదర్శనం నగరంలోని మినార్లు.

కడప కల్చరల్‌ : కడప నవాబుల వైభవ ప్రాభవాలను నేటితరానికి చాటుతూ నాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి ఉన్నాయి ఈ మినార్లు. కడప నగరం ఆవిర్భావాన్ని వివరిస్తూ నాటి ఇస్లామిక్‌ నిర్మాణ శైలిని నేటి తరానికి తెలుపుతున్నాయి. నగరానికి ప్రధాన వాణిజ్య కూడలిగా ఉన్న వైవీ స్ట్రీట్‌ నుంచి వెలుపలికి వచ్చే వారికి ఇవి స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తాయి. కడప కళాక్షేత్రానికి పక్కనే పడమరవైపు వెళ్లే దారిలో ఈ మినార్లు కనిపిస్తాయి. సుమారైన కోటలాంటి ప్రహరీ నిర్మాణం, మధ్యలో ప్రధాన ఆకర్షణగా నిలిచివున్న ఈ మినార్లు నగరంతో పరిచయం గల వారందరూ చూసే ఉంటారు. ఇప్పటికి వాటిని నవాబుల కోటకు సంబంధించిన మినార్లుగానే భావిస్తున్నారు. దీంతోపాటు ఆ మినార్ల నిర్మాతలు, నిర్మాణం, వాటితో కడప నగరానికి గల అనుబంధం తదితర అంశాలు నేటి తరానికి ఆసక్తి గొలుపుతాయి.

చరిత్ర ప్రకారం..

అందిన సమాచారం మేరకు ఈ మినార్ల చరిత్ర ఇలా ఉంది. విజయనగర పాలన అంతమయ్యాక ఈ ప్రాంతం ముస్లింల ఆధీనంలోకి వచ్చింది. తళ్లికోట యుద్ధానంతరం ముస్లిం సైనిక దళాలు భవిష్యయుద్ధ అవసరాల కోసం కొత్త ప్రాంతాలలో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకోవడం ఆరంభించాయి. గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా తన సైన్యంలోని ప్రముఖ యోధుడైన రజాక్‌ అలీని నమ్మకస్తుడైన కొందరు అనుచరులను 16–17 శతాబ్దాల్లో ఈ ప్రాంతానికి పంపాడు. పాలనా దక్షత, సంస్కరణ వాదం, ఆధ్యాత్మికత మెండుగా ఉండడంతో అందరూ రజాక్‌ అలీని నేక్‌నామ్‌ఖాన్‌ (ఉత్తముడు)గా వ్యవహరించేవారు. ఆయన ఈ ప్రాంతానికి వచ్చాక సైనిక స్థావరం ఏర్పాటు కోసం చాలా ప్రాంతాలను పరిశీలించి చివరికి బుగ్గవంక పరివాహక ప్రాంతంలోని మిట్టగా కనిపించిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాడు. యుద్ధ అవసరాలు ఎదురైనపుడు వెంటనే సిద్ధం కావడానికి, దైనందిన అవసరాలు తీర్చుకునేందుకు ఈ ప్రాంతం నివాస యోగ్యమైనదిగా నిర్ణయించుకున్నాడు. సైనికులు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లిపోతుండడంతో ఇక్కడ గ్రామ నిర్మాణం అవసరాన్ని గుర్తించాడు. సమీపంలోని దేవునికడప గ్రామ వాసుల్లో కొందరిని ఒప్పించి ఇక్కడికి రప్పించాడు. బుగ్గవంక కట్టపై సకల సౌకర్యాలతో వారికి నివాసాలు, ఆంజనేయస్వామి ఆలయం కట్టించాడు.

అందమైన భవనం

రజాక్‌అలీ చాలా సుందరంగా పటిష్టంగా విశాలంగా బుగ్గవంక ఒడ్డునే తన రాజ మందిరాన్ని నిర్మించుకున్నాడు. బయటి నుంచి చూస్తే కోటలా అనిపించే ఈ భవనంలోకి వెళ్లేందుకు విశాలమైన ప్రధాన ద్వారాన్ని నిర్మించాడు. ఇరువైపులా ఎత్తయిన బలమైన మినార్లను కూడా కట్టాడు. కిందివైపు కాపలాగది, పైన రెండు అంతస్తుల గదులను ఇస్లామిక్‌ శైలిలో అందంగా రూపుదిద్దారు. లోపల రాణులు, పరిచారికల గదులు కూడా నిర్మించారు. నేక్‌నామ్‌ఖాన్‌ పేరిట కళాక్షేత్రాన్ని కూడా కట్టారు. ఒకప్పటి ఆ ప్రాంగణంలో ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల, హైస్కూలు, చిల్డ్రన్‌ హోం, టెలికాం కార్యాలయాన్ని నిర్మించారు. మినార్లు గల ప్రధాన ద్వారం నుంచే రాకపోకలు సాగేవి. శుక్రవారం నాడు రాజమందిరం వెలుపల ప్రధాన ద్వారం సమీపంలో రాజ మహిళల కోసం ప్రత్యేకంగా బజారును ఏర్పాటు చేసేవారు. మినార్ల సమీపంలో ఉండడంతో దీన్ని మీనా(ర్‌) బజారుగా వ్యవహరించేవారు.

నాటి బురుజు.. నేటి టవర్‌ క్లాక్‌

ఇంత వరకు అందరూ భావిస్తున్నట్లు మినార్ల వెనుకగల ఉన్నది కోట కాదు, రాజ భవనం మాత్రమే. కానీ కోటలాంటి దర్పం కనిపించాలన్న ఉద్దేశంతో నవాబు కోటకు ఎదురుగా ఒక బురుజును కట్టించారు. అదే నేటి టవర్‌ క్లాక్‌. దాంతోపాటు పాత బస్టాండులోని ఎన్‌జీఓ హోం వద్ద గల రెవెన్యూ అసోసియేషన్‌ కార్యాలయ ప్రాంగణంలో మరొక బురుజు ఉంది. అంటే రాజభవనానికి ఇరువైపులా రక్షణ కోసం సిపాయిలు పహారా కాసేందుకు వీటిని నిర్మించారు.


మినార్‌పై పెరిగిన మొక్కలు

దీన స్థితిలో..

ఒకప్పుడు రాచఠీవితో జిల్లాకు గర్వకారణంగా నిలిచిన చారిత్రక భవనం నేడు మరమ్మతులు, నిర్వహణ లేక శిథిలమైంది. ప్రస్తుతం నాటి రాచరికాన్ని చాటుతూ కేవలం ఈ మినార్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇవి నాటి ఇస్లామిక్‌ సంప్రదాయ నిర్మాణ శైలికి అద్దం పడుతున్నాయి. ఇవి కూడా పెచ్చులూడుతూ ఇటుకలు బయటపడి శిథిలస్థితిని తెలుపుతున్నాయి. చుట్టూ చెట్లు పెరిగి ఉండడంతో మినార్లు ఉన్నాయని బయటికి కనిపించడం లేదు. వీటిని స్మారక కట్టడాలుగా ప్రకటించినట్లు పురావస్తుశాఖ బోర్డులు ఉన్నా నిర్వహణ మాత్రం లేదనే చెప్పవచ్చు.